# 15 నుంచి కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

**ఈనాడు, హైదరాబాద్ :** కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 15నుంచి ధ్రువపత్రాల పరిశీలన, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి ఛైర్మన్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్‌కార్డుతో సహా అన్ని ధ్రువపత్రాల అసలు, నకలు కాపీలను తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. సివిల్, సాయుధ, బెటాలియన్, ప్రత్యేక భద్రతాదళం, ఫైర్‌మెన్ అభ్యర్థులకు ఈ నెల 15నుంచి ఆగస్టు 6వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 1,92,588 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరంతా జులై 9 మధ్యాహ్నం 2గంటల నుంచి సమాచార(ఇంటిమేషన్) లేఖలను తమ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. కమ్యూనికేషన్స్ విభాగంలో అభ్యర్థులకు ఈ నెల 29నుంచి ఆగస్టు 4వరకూ నిర్వహిస్తున్నామని, వీరు తమ సమాచార లేఖలను జులై 13 మధ్యాహ్నం 2గంటల నుంచి నియామక మండలి వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

# ఆ యువతికి పూర్తి వైద్యమందిస్తాం

## మంజుల అక్క వైద్యంపై ఆరోగ్య మంత్రి హామీ

**ఈనాడు, హైదరాబాద్:** మెదక్ జిల్లా జోగిపేటకు చెందిన సోమ మంజుల అక్కకు ప్రభుత్వం ద్వారా పూర్తి వైద్యాన్ని అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. పుట్టుకతోనే వికలాంగురాలైన మంజుల బుధవారం మెదక్ జిల్లా సంగారెడ్డికి వచ్చిన ఆరోగ్య మంత్రిని కలిసి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఆమె సోదరి సమస్యలను మంత్రికి విన్నవించాలనుకుంది. అయితే మంత్రిని కలవడానికి అధికారులు అనుమతించకపోవడంపై 'కనీస కనికరం లేదా?' శీర్షికన గురువారం 'ఈనాడు' లో ప్రచురితమైన కథనానికి మంత్రి లక్ష్మారెడ్డి స్పందించారు. సత్వరమే సంగారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి సంఘటనపై ఆరా తీశారు. ఆ యువతి సమస్యను తన దృష్టికి తీసుకురాకుండా అడ్డుకున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మంజుల అక్కకు మందులు, చికిత్స విషయంలో సత్వరమే చర్యలు తీసుకుంటామని, దీనిపై సంగారెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీచేశామని మంత్రి చెప్పారు. వికలాంగురాలైన మంజులకు కూడా ప్రభుత్వం తరఫున సాయమందిస్తామని, ఏవిధమైన సాయం అందించగలమో పరిశీలించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు లక్ష్మారెడ్డి వెల్లడించారు. జోగిపేటకు చెందిన వైద్యులు మంజుల అక్క వద్దకు వెళ్లి మందులు ఇచ్చారని, వైద్య పరంగా ఆదుకుంటామని జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారి అమర్ సింగ్ నాయక్ పేర్కొన్నారు.

# నేడు మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లకు శిక్షణ

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో శిక్షణా విభాగం కన్వీనర్ పొన్నం ప్రభాకర్‌తో కలిసి కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్షించారు.